● దంచికొట్టిన వాన

పలాస నియోజకవర్గం పరిధిలో గురువారం కుండపోత వర్షం కురిసింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మందస, పలాస మండలాల పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో జాతీయ రహదారి వెంబడి ఉన్న వంతెనలు, ముఖ్య కూడళ్లు, కేటీ రోడ్డు, మూడు రోడ్ల కూడళ్ల వద్ద నీరు నిలిచిపోయింది. - కాశీబుగ్గ


వెంకటాపురం వంతెన పైనుంచి పడుతున్న వర్షపు నీరు


లక్ష్మీపురం జాతీయ రహదారి పక్కన వాననీరు


రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

క్లుప్తంగా

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

ఇచ్ఛాపురం: భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాని ఎస్.వి.ఎస్.బి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ ప్రతినిధి వజ్రపు వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో గ్యాస్ కార్యాలయం వద్ద గ్యాస్ పాస్‌బుక్, ఆధార్ కార్డు సహాయంతో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ వద్ద కూడా ఈకేవైసి చేసుకునే అవకాశముందన్నారు.

ఆసక్తికరంగా అష్టావధానం


అష్టావధానం నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌శర్మ

కోటబొమ్మాళి : స్థానిక బి.జె.ఆర్ కల్యాణ మండపంలో గురువారం కోటబొమ్మాళి గ్రామానికి చెందిన సుసరాపు చంద్రశేఖర్‌శర్మ 101 మంది పురోహితులతో అష్టావధానం నిర్వహించారు. ప్రశ్నలు, సమాధానాల ప్రక్రియ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమంలో సుసరాపు గణపతి శర్మ, కళింగ కోమట్ల రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం


బస్సు ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

టెక్కలి: కొందరు విద్యార్థులు బస్సుల్లో ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో వివిధ కళాశాలలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రతి రోజూ ఎంతో మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అయితే బస్సుల్లో ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణాలు చేస్తుండటం ఆందోళకరంగా మారుతోంది. బస్సు లోపల ఖాళీగా ఉన్నప్పటికీ ఇలా ప్రమాదకరంగా ప్రయాణాలు చేయడం మంచిది కాదంటూ స్థానికులు హితవు పలుకుతున్నారు.

మృతుని కుటుంబానికి సాయం


మృతుని కుటుంబానికి సాయం అందిస్తున్న దాతలు

కంచిలి: మండలంలోని పెద్ద అంపురం గ్రామానికి చెందిన ఏదూరి నారాయణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పలువురు దాతలు అండగా నిలిచారు. పద్మతుల గ్రామస్తులు రూ.28 వేలు, ఎస్.ఎం.పురం గ్రామస్తులు రూ.14,500, కొత్తంపురం, ఎస్.ఎం.పురం కాలనీవాసులు రూ.20,430 గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు, దాతలు పాల్గొన్నారు.

సారా ప్యాకెట్ల స్వాధీనం


పట్టుబడిన నిందితుడితో పోలీసులు

కవిటి: మండలంలోని దూగానపుట్టుగకు చెందిన దూగాన ఢిల్లేశ్వరరావు(బాలు) ఒడిశా నుంచి అక్రమ మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా గురువారం పట్టుబడ్డాడు. ఇచ్ఛాపురం సెబ్ సిబ్బంది కరాపాడు రైల్వేగేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా 50 సారా ప్యాకెట్లతో పట్టుబడినట్టు సీఐ విజయలక్ష్మి, ఎస్ఐ నరేంద్రకుమార్, సిబ్బంది కూర్మినాయకులు,ఎన్‌టీనాయుడు తెలిపారు. ఢిల్లేశ్వరరావుపై కేసు నమోదుచేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత ఉన్నత విద్యావకాశాలను పొందుతారని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కె.సూర్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ స్కూల్స్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఇన్నేసుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎస్.మణి(ఎస్.ఎం.పురం), డి.జైదీప్(గుంటూరు, తాడికొండ), డి.కౌశిక్(గుంటూరు, తాడికొండ), ఈ.మహేశ్(గుంటూరు, తాడికొండ)లను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శంకరం, ఎం.తారకేశ్వరరావు, పి.దాశరథి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ సాగు నీరందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస : నియోజకవర్గంలో ప్రతి రైతుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులకు సూచించారు. గురువారం మైనర్ ఇరిగేషన్ అధికారులతో సాగునీటి వనరులపై పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సాగునీటి వనరుల పరిస్థితి, ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం చేపట్టిన పనుల వివరాలు, ఇప్పుడు చేయాల్సిన పనులపై చర్చించారు. నియోజకవర్గంలో చిన్నతరహా సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. పనుల అంచనాలను తయారు చేసి వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో పలాస మైనర్ ఇరిగేషన్ ఏఈ మధు, డీఈ జి.వి.రమణ, అనిల్, డి.మీనా, ఎంపీటీసీ వి.మాధవరావు, దాసరి తాతారావు, వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆశావర్కర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో యజ్ఞ, పి.సర్వతిదేవి, హేమలత, రేణుక, ద్రౌపది, ఎం.లావణ్య, బి.రజిని, పి.పార్వతి, ఎం.లలిత, పి.మీనా, జ్యోతి మహంతి, పుణ్యవతి, పి.స్వాతి, జి.శ్యామల, సుధా, సిమ్మమ్మ, శోభ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: ఎమ్మెల్యే శిరీషను పలాస అటవీశాఖ అధికారి పి.రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ డిక్కల ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు


నగదు పురస్కారం అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డబ్బీరు వెంకటరత్నం అకడమిక్ మెరిట్ అవార్డు కింద నగదు ప్రోత్సాహకాలను ప్రధానోపాధ్యాయుడు బి.కామరాజు చేతుల మీదుగా గురువారం అందజేశారు. సూరిశెట్టి ఉషారాణికి రూ.4వేలు, దూబ రోజా, ముద్దాడ సాయికి చెరో రూ.3వేలు చొప్పున మొత్తం రూ.10వేలు అందజేశారు. ప్రతి ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్నందుకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: వర్షాకాలంలో ప్రబలుతున్న మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్ని అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ సిబ్బందికి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశా, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పారిశుధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్రతి 15 రోజులకు ఒకసారి మంచినీటి ట్యాంకుల్ని పరిశుభ్రం చేయడం, బావుల్లో క్లోరినేషన్ చేయించడం, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయడం తప్పనిసరని పేర్కొన్నారు. వ్యాధులు వ్యాపిస్తే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎల్ఎన్ ప్రసాద్, ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ పి.నాగరాణి, ఏఈఈ రూనా విశ్వనాథం, కొళిగాం, ఈదుపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ వై.కల్యాణి, డాక్టర్ వెచ్చా సంతోష్ చలమాజీ, ఈఓపీఆర్‌డీ కె.వి.ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ

కవిటి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 1న సచివాలయ ఉద్యోగులతో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం అన్ని సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ వంశీకృష్ణ, ఈఓపీఆర్డీ శివాజీ పాణిగ్రాహిలతో సమావేశం నిర్వహించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

మఖరజోలలో గణితావధానం

పలాస: మందస మండలం మఖరజోల గ్రామంలో గురువారం గణితావధానం, మేధా సంపత్తి ప్రదర్శన నిర్వహించారు. ఉలాల నందుయాదవ్ అనే మూడో తరగతి విద్యార్థి ఉపాధ్యాయుడు మడ్డు తిరుపతిరావు పర్యవేక్షణలో అద్భుతంగా గణిత గణాంకాలను చెబుతూ ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో జన జాగృతి సంస్థ నిర్వాహకులు తెప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సోంపేట: ఉపాధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.బి.చిట్టిరాజు అన్నారు. సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల ఉపాధి సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమవుతున్నందున ప్లాంటేషన్ పనులు చేపట్టాలన్నారు. పంట కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ శ్రీనివాసరెడ్డి, కోర్స్ డైరెక్టర్లు వై.వి.రమణ, అమ్మినాయుడు, ఏపీఓలు ప్రమీల, శ్రీనివాసరావు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవరుచుకోవాలి


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్నప్పుడే ఆత్మజ్ఞాన ప్రబోధం జరుగుతుందని కర్ణాటకకు చెందిన ప్రకాశానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. బెండికొండలోని జ్ఞానబోధానంద ఆశ్రమంలో వారం రోజులుగా జరుగుతున్న గురుపూజా మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. 24వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ప్రవచనాలు, శ్రీమద్భాగవత సప్తాహం నిర్విరామంగా చేపట్టారు. ఓంకార ధ్యానం, పతాకావిష్కరణ, ఆశ్రమ వద్ద యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు డి.శుభలక్ష్మీ, కాపు తెంబూరు దత్తపీఠం స్వామీజీ నిర్విషయానంద, టి.కూర్మయ్య, ఎస్.సారథినాయుడు, టి.కుశరాజు, కె.గోపాలరావు, టి.వాసుదేవు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

సోంపేట: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొర్లాం పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి సూచించారు. కొర్లాం గ్రామంలో జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, పంచాయతీ అధికారులు గురువారం గ్రామంలో పర్యటించి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే చర్యలు


వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

ఇచ్ఛాపురం రూరల్: ద్విచక్ర వాహనచోదకులు డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్‌ను ధరించకపోతే చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణ్ హెచ్చరించారు. గురువారం ఈదుపురం కూడలిలో వాహనాల తనిఖీల్లో భాగంగా హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు ఉండాలని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.

రోటరీ క్లబ్ ఔదార్యం


వార్డెన్‌కు ఫ్యాన్లు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని బీసీ బాలుర వసతి గృహానికి సోంపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు సాయం అందించారు. ఇటీవల పిడుగుపాటు ధాటికి బీసీ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్లు పాడయ్యాయి. విషయం తెలుసుకున్న రోటరీ ప్రతినిధులు గురువారం 8 సీలింగ్ ఫ్యాన్లను వార్డెన్ జి.రామారావుకు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, రొటేరియన్ మల్లా తిరుమలరావు సౌజన్యంతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు, హైస్కూల్ ఉపాధ్యాయుడు నగిరి శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి : ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పంచాయతీల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు వి.జయరాజ్ పేర్కొన్నారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధుల నిర్మూలన, పారిశుధ్య నిర్వహణపై గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం కంచిలి పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.నీరజ, పశువైద్యాధికారి టి.శిరీష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్


సమీక్ష నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి కృషి చేయాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత ఆదేశించారు. గురువారం న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకూ వచ్చిన రాజీ దరఖాస్తులను పరిశీలించారు. ఈ నెల 29న వీటిని పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీపీ సంపతిరావు తిరుపతి, బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు యు.తిరుమలరావు, వాన నేతాజీరావు, పల్లి వాసుదేవరావు, ఎస్.శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కాశీబుగ్గ: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, పంట రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘ నాయకులు చాపర వేణుగోపాలరావు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం పలాస తహశీల్దారు ఎస్ఎస్‌వీఎస్ నాయుడుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తిరుపతిరావు, వాసుదేవరావు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

బడి రుణం తీర్చుకుందాం


విద్యోపకరణాలు అందజేస్తున్న ఎంఈఓ అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: మనకు విద్యా బుద్ధుల్ని నేర్పించి ప్రయోజకులుగా మార్చిన ఊరి బడి రుణం తీర్చుకునేందుకు ప్రతి పూర్వ విద్యార్థి ముందుకు రావాలని ఎంఈఓ కురమాన అప్పారావు పిలుపునిచ్చారు. తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు తిప్పన శంకర్‌రెడ్డి పాఠశాలకు రూ. 20 వేలు విలువైన విద్యోపకరణలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, గ్రామపెద్ద తిప్పన దాలయ్య రెడ్డి, హెచ్ఎం ఆశి పురుషోత్తమరెడ్డి, కొప్పల శ్యామ సుందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్న మహిళ రైతు సంఘంలో సభ్యురాలిగా చేరి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు కావాలని సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు అన్నారు. గురువారం ఇచ్ఛాపురం మండల మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సొమ్మును వారి అవసరాలకు అంతర్గత అప్పు రూపంలో నిబంధనలు విధించకుండా మంజూరు చేయాలన్నారు.

టెక్కలిపట్నంలో పారిశుద్ధ్య వారోత్సవాలు

కాశీబుగ్గ: పలాస మండలం పరిధిలో పలు పంచాయతీలలో గురువారం పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించారు. టెక్కలిపట్నం, రెంటికోట, అల్లుఖోల పంచాయతీలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య ప్రత్యేకాధికారి ముద్దాడ వెంకటరమణ, పలాస ఎంపీడీఓ మెట్ట వైకుంఠరావు, కోరాడ కరుణకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'ని వ్యవసాయ పనులకు అనుసంధానించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతాంగ సాధన కమిటీ ప్రతినిధులు

పలాస/కాశీబుగ్గ: ఉద్దానం ప్రాంతంలో జీడి, కొబ్బరి, ఇతర వ్యవసాయ పనులకు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి, కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేయాలని, జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, 80 కేజీల బస్తాకు రూ.16వేల మద్దతు ధర అందించాలని, రైతు రుణాలను మాఫీ చేయాని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మామిడి మాధవరావు, గొర్లె చలపతి, నల్ల హడ్డిమాస్టారు, కిక్కర ఢిల్లీరావు, గర్తం తులసీరావు, తామాడ అప్పారావు, దాసరి శ్రీరాములు, పుచ్చ దుర్యోధన, బొడ్డు సింహాద్రి, సోమనాథం, డొక్కర వీరాస్వామి, రాజాం గుణవంతు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పీఎంపురంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు : పలాస నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిచ్చి చిత్తశుద్ధితో పని చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం పెద్దమురహరిపురంలో సర్పంచ్, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు అధ్యక్షతన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాడ్ నిధులు రూ.2.50 లక్షలతో గుండం చెరువుకు మెట్ల నిర్మాణం, రూ.3 లక్షల పంచాయతీ నిధులతో 120 మీటర్ల మేర సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మరో రూ.20లక్షలు వరకు నిధులు ఎంపీ ల్యాడ్ నుంచి మంజూరయ్యాయని తెలిపారు. పూండి-మంచినీళ్లపేట రహదారి విస్తరణకు ప్రణాళికలు రూపొందించి డబుల్ రోడ్డు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.మోహనరావు, ఎంపీటీసీ సభ్యులు జి.వసంతరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కలిశెట్టి గోపాల్, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పి.ఈశ్వరరావు, గోవింద పాపారావు, కె.రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గర్తం దానేస్, మాజీ సర్పంచ్ కె.పార్వతి, డి.షణ్ముఖరావు, చింత నారాయణ పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న సంఘ నేతలు

కవిటి: ప్రభుత్వ,జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించి న్యాయం చేయాలని సంఘం నేతలు కోరారు. ఈ మేరకు గురువారం రామయ్యపుట్టుగలోని ఆయన నివాసంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలని, రాగిజావ మెనూ మార్చాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు సనపల రామకృష్ణ, బెందాళం మల్లేశ్వరరావు, ఎస్.విశ్వనాథం, ఎన్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కాశీబుగ్గ: మందస మండలం మకరజోల గ్రామంలో విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు పైల మల్లేశ్వరరావు రచించిన శ్రీభవానీత్రిశతి అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. స్థానిక రామలింగేశ్వర ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రామినాయుడు, మేడూరి సత్యనారాయణమూర్తి, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, పైడి హరినాథ్, బమ్మిడి సుబ్బారావు, లక్ష్మణ మాస్టారు, మూల తాతయ్య, బండారి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పూండి-గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గురువారం గోవిందపురం ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కె. హరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సీపాన గోవిందరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్ని రమణ, లావేటి శంకరరావు, గొర్లె గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: స్టూడెంట్స్ కిట్లను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు దుంగు వరలక్ష్మీ అన్నారు. ఇన్నేసుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కె.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు బి.శంకరం, ఎం.తారకేశ్వరరావు, పి.దాశరథి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.